ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

ఆదివారం 1 జూన్ 2025



రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కారం

బషీరొద్దిన్, తహసీల్దార్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: రెవెన్యూ సదస్సులు ఎప్పటి నుంచి నిర్వహిస్తున్నారు

తహసీల్దార్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 3నుంచి 17 వరకు గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నాం. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

ఆంధ్రజ్యోతి: సదస్సుల ద్వారా ప్రజలకు ఎలాంటి సేవలందిస్తారు

తహసీల్దార్: ఆయా గ్రామాలలో నిర్వహించే రెవెన్యూ సదస్సులలో వ్యవసాయ, భూ సంబంధిత సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తాం. భూ సమస్యలు ఉన్న వారు దరఖాస్తు ఫారంలో వివరాలు నింపి గ్రామాలకు వచ్చిన అధికారులకు ఇవ్వాలి.

ఆంధ్రజ్యోతి: ఏయే తేదీలలో ఏ గ్రామంలో సదస్సులు నిర్వహిస్తారు


తహసీల్దార్: 3న గొల్లపల్లి, సుద్దాల, 4న నీరుకుళ్ళ, కదంబాపూర్, 5న దుబ్బపేట, తొగర్రాయి, 6న భూపతిపూర్, మంచరామి, 9న సుల్తానాబాద్, పూసాలలో, 10న రేగడి మద్దికుంట, మియాపూర్ 11న ఐతరాజుపల్లి, 12న చిన్నబొంకూరు, రెబ్బల్‌దేవ్‌పల్లి, 13న కొదురుపాక, చిన్నకలువల, 16న కనుకుల, 17న గర్రెపల్లిలో సదస్సులుంటాయి.

- సుల్తానాబాద్

- ఆధార్ మాదిరిగా రైతులకు భూధార్ కార్డులు
- పట్టా భూములు కలిగిన వారి వివరాలే నమోదు
- రైతువేదికలు, గ్రామాల్లో నమోదు చేస్తున్న ఏఈవోలు



ముత్తారం మండలం మచ్చుపేటలో రైతుల భూముల వివరాలు సేకరిస్తున్న ఏఈఓలు



భూధార్ ఉంటేనే కేంద్ర పథకాల వర్తింపు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

భూధార్ కార్డు ఉంటేనే వ్యవసాయ పరంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వర్తించనున్నాయి. ఆ మేరకు తప్పనిసరిగా భూధార్ గుర్తింపు కార్డు పొందాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు జిల్లాలో వ్యవసాయ విస్తీర్ణాధికా రులు రైతు వేదికలు, గ్రామాలకు వెళ్లి భూ ముల వివరాలను నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 25 శాతం వరకు నమోదు ప్రక్రియ ముగిసిందని చెబుతున్నారు.ఆధార్‌కార్డు మాదిరిగా సొంత భూములు కలిగిన రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం భూధార్ సంఖ్యను కేటాయిస్తుంది. వ్యవ సాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు చేపట్టింది. భూమి హక్కులను ధ్రువీకరించేందుకు ఆధీకృత రికార్డులు కలిగిన రైతు లకు మాత్రమే ఈ విశిష్ట గుర్తింపు సంఖ్యను జారీ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, రాయితీలు, బ్యాంక్ రుణాలు వంటి సౌకర్యాలకు భూధార్ తప్పని సరి అని కేంద్రం స్పష్టం చేసింది. ఆ మేరకు జిల్లాలో ఈ నెల 5వ తేదీ నుంచి రైతువేదికల్లో ఆన్‌లైన్‌లో భూముల వివరాలను నమోదు చేయడంతో పాటు గ్రామాలకు వెళ్లి కూడా వ్యవసాయ విస్తీర్ణ అధికారులు వివరాలు నమోదు చేస్తున్నారు.

● 25 శాతం భూముల వివరాలు నమోదు..

జిల్లాలో సుమారు 2 లక్షల 90 వేల ఎకరాల సాగు భూములు ఉండగా, ఆ భూములను 1,61,743 మంది రైతులు పట్టాలు కలిగి ఉన్నారు. ఇప్పటి వరకు భూధార్ కోసం 40 వేల మంది రైతుల భూముల వివరాలను నమోదు చేశారు. వచ్చే నెల 5వ తేదీ వరకు గడువు ఉన్నప్పటికీ, పొడిగించే అవకాశాలు లేకపోలేదని వ్యవసాయ శాఖాధికారులు పేర్కొంటు న్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఒక పోర్టల్‌ను రూపొం దించింది. దానికి సంబంధించిన యాప్‌ను ఏఈవోలు మొబైల్ ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని లాగిన్ అవుతున్నారు. పట్టా భూములు కలిగిన రైతుల ఆధార్ నంబర్ నమోదు చేయగానే, అప్పటికే ఆ పోర్టల్‌లో సంబంధిత రైతుల భూముల వివరాలు వస్తుం టాయి. రైతులు తీసుకవచ్చిన పట్టాదారు పాసు పుస్త కాల్లో ఉన్న వివరాలను సరి చూసుకుని నమోదు చేస్తున్నారు. మొదట ఒక తాత్కాలిక రిజిస్ట్రీ నంబర్‌తో రైతుల భూముల వివరాలను నమోదు చేస్తున్నారు. ఆ తర్వాత 11 అంకెలు గల భూధార్ నంబర్‌ను కేటాయించనున్నారు. అయితే కేవలం నంబర్ మాత్రమే కేటాయిస్తారా, కార్డు జారీ చేస్తారా అనే విషయమై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. డిజిటల్ అగ్రిమిషన్ కార్యక్రమంలో భాగంగా రైతులందరికి విశిష్ట గుర్తింపు సంఖ్యను జారీ చేయాలని కేంద్రం

(మిగతా 8వ పేజీలో)

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, జూన్ 2 నుంచి చేపట్టనున్న వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను విజయవంతంగా అమలు చేయాలని కార్పొరేషన్ కమిషనర్, అదనపు కలెక్టర్ అరుణశ్రీ పేర్కొన్నారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులు, సిబ్బందికి యాక్షన్‌ప్లాన్‌పై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో వరదలు, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్య అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రతీ ఇంటి నుంచి చెత్త సేకరించాలని, ప్రజా మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచడం, శుక్రవారం డ్రైడే చేపట్టడం, చెత్త నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి శుభ్రం చేయాలన్నారు. నాలాల్లో పూడికతీతతోపాటు మొక్కలు నాటాలన్నారు. శిథిలావస్థలో ఉన్న కట్టడాలను, భవనాలను తొలగించేలా కార్యాచరణ అమలు చేయాలన్నారు. కార్పొరేషన్ ఆదాయం పెంపొందించడంలో భాగంగా అండర్ అసెస్‌మెంట్, అన్ అసెస్‌మెంట్, వాణిజ్య ఆస్తులను గుర్తించి పన్నులను సవరించాలని, ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేయాలన్నారు. కొత్త స్వశక్తి సంఘాలను ఏర్పాటు, బ్యాంకు లింకేజీ, వీధి వ్యాపారులకు రుణాలు, వెండింగ్ జోన్లు ఏర్పాటు చేయాలన్నారు. డివిజన్లలో జరిగే కార్యక్రమాల్లో వార్డు అధికారులు భాగస్వాములు కావాలన్నారు. డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ఎస్‌ఈ శివానంద్, ఈఈ రామన్, డీఈఈలు హనుమంతనాయక్, షాబాజ్, జమీల్, ఆంజనేయులు, టీపీఓ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, మెప్మా డీఎంసీ మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

ఖని జనరల్ ఆసుపత్రి డైట్ కాంట్రాక్టు రద్దు

కళ్యాణ్‌నగర్, మే 31(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో డైట్ కాంట్రాక్టును రద్దు చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. డైట్ కాంట్రాక్టు కోసం గత నెల 19న టెండర్ నిర్వహించడానికి బహిరంగ ప్రకటన చేశారు. 25వ తేదీ వరకు టెండర్లు సమర్పించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ కోరారు. ఈనెల 30న దరఖాస్తులు తెరవడానికి గడువుకాగా ప్రస్తుతం నిర్వహిస్తున్న కాంట్రాక్టర్‌తోపాటు మరో తొమ్మిది మంది టెండర్లు దాఖలుచేశారు. గురువారం టెండర్లు తెరవాల్సి ఉండగా కలెక్టర్ కోయ శ్రీహర్ష టెండర్లను రద్దు చేస్తూ ప్రకటన విడుదల చేశారు. స్వశక్తి సంఘాలతో భోజనం సరఫరా చేయడానికి నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల గోదావరిఖని, మంథని, పెద్దపల్లి ఆసుపత్రులలో తనిఖీ చేయగా మంథని, పెద్దపల్లిలో పరిశుభ్రమైన ఆహారం అందించడం లేదని ఫిర్యాదులు వచ్చాయి. గోదావరిఖనిలో డైట్ కాంట్రాక్టు ఆదివారం ముగియనున్నది. స్వశక్తి సంఘాలకు అప్పగించే వరకు పాత కాంట్రాక్టరే కొనసాగనున్నారు. కాగా, రెండు సంవత్సరాలుగా రోగులకు భోజనం పెడుతున్న డైట్ కాంట్రాక్టర్‌కు బిల్లులు రాక అవస్థలు పడుతున్నారు. మూడేళ్ళలో ఒక ఏడాది మాత్రమే బిల్లులు చెల్లించారని కాంట్రాక్టర్ చెబుతున్నాడు.

సంతోష్‌రావును బయటకు పంపేందుకే కేసీఆర్ కుటుంబ డ్రామా



చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి

ధర్మారం, మే 31 (ఆంధ్రజ్యోతి): సంతోష్‌రావును బయటకు పంపేందుకే కేసీఆర్ కుటుంబం డ్రామాలు ఆడుతుందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. కేసీఆర్ కుటుంబంలో ఆస్తి పంపకాలు, కమీషన్ల దందా విషయంలో కోల్డ్‌వార్ నడుస్తుందని, సంతోష్‌రావు ఉన్నంత కాలం తమది నడవదనే నెపంతోనే కవిత ఈ డ్రామాకు తెరలేపిందన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైన పార్టీలు పెట్టుకోవచ్చని, ప్రజల మధ్యకు వెళ్లవచ్చని తెలిపారు. అసలు కవిత కోసం ఇంత ప్రచార ఆర్భాటం, రాజకీయ రగడ చేయడానికి ఆమె ఏమైన స్వాతంత్ర్య సమరయోధురాలా? తెలంగాణ కోసం పోరాడి జైలుకు వెళ్లిందా? అని ప్రశ్నిం చారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, కవిత అంతా ఒకటేనని, నెలలోపు అందరూ కలు స్తారని జోస్యం చెప్పారు. అనంతరం లబ్ధిదా రులకు చెక్కులు పంపిణీ చేశారు. తహసీ ల్దార్ ఎండీ వకీల్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లానా యక్, వైస్ చైర్మన్ అరిగె లింగయ్య, పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మెన్ కొత్త నర్సింహులు, నాయకులు సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో రోడ్డు వెడల్పు పనులు ప్రారంభం



ఎక్స్‌కావేటర్‌తో నిర్మాణాలను తొలగిస్తున్న సిబ్బంది

జ్యోతినగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ మేడిపల్లి రోడ్డు వెడల్పు పనులకు మున్సిపల్ అధికారులు శ్రీకారం చుట్టారు. రోడ్డు వెడల్పు పనుల కోసం అడ్డుగా ఉన్న నిర్మాణాలను శనివారం మున్సిపల్ సిబ్బంది ఎక్స్‌కావేటర్‌తో తొలగించారు. మేడిపల్లి సెంటర్ నుంచి భరత్‌నగర్ వరకు 80 ఫీట్ల రోడ్డును నిర్మించాలని మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. దీనిలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా 40 ఫీట్లుగా నిర్ధారించి అడ్డుగా ఉన్న దుకాణాలు, షెడ్లు, ఇతర నిర్మాణాలను తొలగించారు. శనివారం కుడివైపు నిర్మాణాలను తొలగించారు.

కాగా, ఇంటి యజమానులకు సమయం ఇవ్వకుండానే మున్సిపల్ అధికారులు కూల్చివేతలు చేయడం సరైంది కాదంటూ సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం మార్కింగ్ చేసి 24 గంటల్లోనే కూల్చివేయడం సమంజసం కాదని జిల్లా నాయకులు నాంసాని శంకర్, గీట్ల లక్ష్మారెడ్డి అన్నారు. భవనాల యజమానులకు కనీసం 15 రోజుల సమయం ఇవ్వాలన్నారు. నిర్మాణాల తొలగింపు ప్రక్రియలో ఎక్కువ నష్టం కలగకుండా ఎమ్మెల్యే చొరవ తీసుకొని ఆ దిశగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

పశువుల అక్రమ రవాణా నివారణకు పటిష్ట చర్యలు



గుంపులలో ఏర్పాటు చెక్ పోస్ట్

పెద్దపల్లిటౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) బక్రీద్ పండుగను పురస్కరించుకొని పశువుల అక్రమ రవాణా నిరోధానికి జిల్లాలో అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారని కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7న బక్రీద్ పండుగ సందర్భంగా ఆవులు, ఎద్దులు, కోడె దూడలను అక్రమంగా తరలించకుండా జిల్లాలో 3 చెక్ పోస్టులను బసంత్‌నగర్ దుబ్బపల్లి, గుంపుల వద్ద ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలీసు, పశుసంవర్ధక శాఖ అధికారులు సంయుక్తంగా చెక్‌పోస్టులలో విధులు నిర్వహిస్తున్నారని, చెక్‌పోస్టుల 24 గంటలపాటు పనిచేస్తాయని అవసరమైతే మరో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. పశువుల తరలించే వాహనం, డ్రైవర్ వివరాలు, ఎక్కడి నుంచి ఎక్కడి వరకు తీసుకెళ్తున్నారని వివరాలను అధికారులు పరిశీలిస్తారని తెలిపారు. బక్రీద్ పండుగకు అక్రమంగా ఆవులు ఎద్దులు లేగ దూడలను రవాణా అడ్డుకోవడం లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రజలు కూడా పూర్తిగా సహకరించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

చెక్‌పోస్ట్ ఏర్పాటు

ఓదెల, మే 31 (ఆంధ్రజ్యోతి) : బక్రీద్ నేపథ్యంలో పొత్కపల్లి ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో గుంపులలో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. వాహనాలను తనిఖీ ముమ్మరం చేశామని తెలిపారు.

దళితులను నమ్మించి మోసం చేసింది కేసీఆరే



లబ్ధిదారుడికి మంజూరు పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

జూలపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): దళితులను నమ్మించి మోసం చేసింది కేసీఆరేనని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు విమర్శించారు. పెద్దాపూర్, బాల్‌రాజ్‌పల్లి, కుమ్మరికుంట, కీచులాటపల్లి, కాచాపూర్ గ్రామాల్లో శనివారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించి, ఇండ్లకు ముగ్గులు పోసి పనులను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో కోటి 35లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తొలి ముఖ్యమంత్రిని దళితులనే చేస్తానని ప్రకటించి అధికార వ్యామోహంతో దళితులను మోసం చేసి కేసీఆర్ గద్దెనెక్కాడని, కేసీఆర్ దళితజాతుల వ్యతిరేకిగా చరిత్రలో నిలిచిపోతాడని విమర్శించారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాతున్నట్లుగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒకటేనని ఇందులో ఎలాంటి అనుమానం లేదన్నారు. వరంగల్‌లో నిర్వహించిన బహిరంగ సభలో కేసీఆర్ బీజేపీపై విమర్శలు చేయకపోవడం ఇందుకు నిదర్శనమన్నారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ మాట్లాడుతున్న మాటలు సినిమాలో జోకర్‌లా తలపిస్తున్నాయని, ఆయన మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మంద క్రిష్ణ మాదిగ ఆధ్వర్యంలో మాదిగలు, ఉప కులాలు ఎస్సీ వర్గీకరణకు ముప్పై ఏళ్లుగా చేస్తున్న ఉద్యమానికి సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి అసెంబ్లీలో తీర్మానం చేసిన ఘన త తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎంపిడివో పద్మజ, ఎంపిఓ అనిల్‌రెడ్డి, మార్కె ట్ కమిటి చైర్మన్ గండు సంజీవ్, మాజి జడ్పిటిసి బొద్దుల లక్ష్మీనర్సయ్య, విండో చైర్మెన్ వేణు గోపాల్‌రావు, నాయకులు బొజ్జ శ్రీనివాస్, నర్సింహాయాదవ్, లోక జలపతిరెడ్డి, జెట్టి సతీష్, రవిందర్‌రావు, బండి స్వామి,కోరికంటి మల్లయ్య, కందుకూరి అంజయ్య, తోట శంకరయ్య, కొట్టె సంజీవ్ పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు ఘన స్వాగతం



ఎమ్మెల్యే విజయరమణారావు నివాసంలో మంత్రి సీతక్క

ఎలిగేడు, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఘనస్వాగతం పలికారు. శనివారం రాత్రి మండలంలోని శివపల్లి గ్రామంలోని ఎమ్మెల్యే నివాసానికి మంత్రి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంత్రి సీతక్కను శాలువాతో సన్మానించారు. మంచిర్యాల నుంచి హైదారాబాద్ వెళుతూ మంత్రి సీతక్క కాసేపు విజయరమణారావు నివాసంలో సేదదీరారు. అనంతరం హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. ఎలిగేడు, సుల్తానాబాద్ మండలాల కాంగ్రెస్ అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, చిలుక సతీష్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, సుల్తానాబాద్ మార్కెట్ కమిటి చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, నాయకులు దుగ్యాల సంతోష్‌రావు, రాంచందర్‌రావు, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, అబ్బయ్యగౌడ్, సాయిరి మహేందర్, ఉస్తెం గణేష్, బూర్ల వెంకటసత్యం, పల్లెర్ల వెంకటేష్‌గౌడ్, అమ్ముల శ్రీనివాస్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వినియోగంతో అనారోగ్యం 8

నిర్మాణానికి నోచుకోని బాలికల జూనియర్ కళాశాల

- జిల్లా కేంద్రంలో శిథిలావస్థకు చేరిన కళాశాల
- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- రెండేళ్ళుగా బాలుర కళాశాల ల్యాబ్‌లో కొనసాగుతున్న తరగతులు
- రేపటి నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభం

పెద్దపల్లిటౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గర్ల్స్, బాయ్స్ కాలేజీలు రెండు వేర్వేరు భవనాల్లో కొనసాగుతున్నాయి, అయితే బాలికల జూనియర్ కాలేజీ భవనం శిథిలావస్థకు చేరడంతో మూడేళ్ళ క్రితం నూతన భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు. నిధులు మంజూరైనా స్థల వివాదం తల్తెడంతో ఆ నిధులు వెనక్కి మళ్ళాయి. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్ళీ నిధులు మంజూరు చేసింది. శిథిలావస్థలో భవనాన్ని కూల్చివేసి నెలలు గడుస్తున్నా భవన నిర్మాణ పనులు మొదలు కాలేదు.

జిల్లా కేంద్రంలో బాలికల జూనియర్ కాలేజీ పాత బిల్డింగ్ శిథిలావస్థకు చేరడంతో రెండేళ్ల క్రితం క్లాసులను బాలుర జూనియర్ కాలేజీలోని సైన్స్ ల్యాబ్‌లో తరగతులు నిర్వహిస్తున్నారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మూడేళ్ల క్రితం కాలేజీ నిర్మాణం చేపట్టేందుకు నిర్ణయించింది. దీంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. దీంతో 2 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. టెండర్ పిలిచి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. అయితే కాలేజీలో నిర్మాణానికి ఎంచుకున్న స్థలంపై వివాదాలు తలెత్తాయి. దీంతో కాంట్రాక్టర్ పనులు వదులుకున్నాడు. ఇంకా బాలికల కాలేజీ తరగతులు సైన్స్ లైబ్రరీ రూంల్లోనే జరుగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత కాలేజీ నిర్మాణం ప్రస్తావనకు రావడంతో మళ్ళీ ప్రతిపాదనలు పంపించారు. వెంటనే ఆమోదించి నిధులు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ కూడా పూర్తి కావాల్సి ఉంది. ఇది ఇలా ఉండగానే హడావుడిగా శిథిలావస్థలో ఉన్న బిల్డింగ్ కూల్చివేసి చదును చేశారు. వెంటనే పూర్తి చేయాలకున్న భవనం నాలుగు నెలలైనా పనులు మొదలు పెట్టలేదు. ఈ విద్యాసంవత్సరం కొత్త భవనంలో కొనసాగుతుందని విద్యార్థులు ఆశపడ్డారు. కానీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న తీరున కాలేజీ నిర్మాణం ఇంకా మొదలు కాకపోవడంతో విద్యార్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్ళపాటు గర్ల్స్, బాయ్స్ కాలేజీ విద్యార్థులకు సైన్స్ ల్యాబ్ లేకుండా పోయింది. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు తరగతులు నష్టపోవాల్సి వస్తోంది. దీంతో ఈ యేడాది కూడా బాలికల తరగతులు బాలుర కాలేజీ ల్యాబ్‌ల్లోనే జరుగుతాయని తెలుస్తుంది. పాత టెండర్ అగ్రిమెంట్ ప్రకారం జూన్ 1 వరకు నిర్మాణం పూర్తి చేసి తరగతులు అందుబాటులోకి రావాల్సి ఉండేది. 2 కోట్ల రూపాయల నిధులున్నప్పటికి అధికారుల నిర్లక్ష్యంతో భవన నిర్మాణ పనులు మొదలు కావడం లేదు. మరో రెండు రోజుల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది.

● ఇదిలా ఉంటే బాలికల కాలేజీని పూర్తిగా రద్దు చేసి కోఎడ్యుకేషన్ చేయాలనే ఆలోచనలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రంలో ఉన్న బాలికల జూనియర్ కాలేజీని కాపాడలేక పోతున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కాలేజీ నిర్మాణం చేపట్టకపోతే ఉద్యమిస్తామని హెచ్చరిస్తున్నారు.



కళాశాల నిర్మించే స్థలం

● వసతుల లేమితో ఇబ్బందులు

జూనియర్ కళాశాల బిల్డింగ్ శిథిలావస్థకు చేరడంతో దానిని మూసేశారు. బాలికల తరగతులు బాయ్స్‌కాలేజీ సైన్స్ ల్యాబ్‌లో నిర్వహిస్తున్నారు. ఇంటర్ సైన్స్ గ్రూపులకు ప్రాక్టికల్‌కు ల్యాబ్‌లు అందుబాటులో లేకుండా పోయాయి. విద్యార్థినులకు టాయిలెట్స్ కూడా అందుబాటులో లేవు. ఇతర ప్రాంతాల నుంచి కళాశాలకు వచ్చి చదువుతున్నారు. ప్రభుత్వ కాలేజీలో ఎక్కువ మంది పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులే ఉన్నారు. మూడేళ్లుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ఆయా కాలేజీల ప్రిన్సిపాల్స్, సిబ్బంది ఇంటింటి ప్రచారం చేసి విద్యార్థులను కాలేజీల్లో జాయిన్ చేశారు. విద్యార్థులు ఆశించిన విధంగా కాలేజీలో మౌలిక వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం నూతన భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థులు కోరుతున్నారు.

తప్పిపోయిన చిన్నారి.. తల్లిదండ్రులకు అప్పగింత

కోల్‌సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని లక్ష్మీనగర్‌లో ఓకుటుంబం ఐదుసంవత్సరాల పాపతో షాపింగ్‌కు వచ్చారు. పాప ఆడుకుంటూ బయటకు వెళ్లి లక్ష్మీనగర్ నుంచి గాంధీచౌక్ వెళ్లింది. ఆమెకు దారి తెలియపోవడంతో గుర్తించిన స్థానికులు బ్లూకోట్స్‌కు సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన సిబ్బంది పాపతల్లిదండ్రుల గురించి వాకబు చేశారు. తల్లిదండ్రుల వివరాలను గుర్తించేందుకు సోషల్‌మీడియాలో ప్రచా రం చేయించారు. పాప బ్లూకోట్స్‌వద్ద ఉన్న సమాచారం తెలుసుకొని ఆమెతల్లిదండ్రులు పోలీసులను సంప్రదించారు. తప్పిపోయిన చిన్నారిని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. బ్లూకోట్స్ సిబ్బంది తిరుపతి, నవీన్‌లను సీఐ ఇంద్రసేనారెడ్డి అభినందించారు.

4న వాహనాల వేలం

పెద్దపల్లిటౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : వివిధ కేసులలో పట్టుబడిన 10 వాహనాలకు ఈనెల4న ఉదయం 11 గంటలకు పెద్దపల్లి ఎక్సైజ్‌స్టేషన్ బందారికుంటలో వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ ఇన్స్‌పెక్టర్ కె నాగేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంవేసే వాహనాలలో టీవీఎస్ స్టార్ సిటీ, టాటా సుమో, టీవీఎస్ ఎక్సెల్, హీరో గ్లామర్, హోండా యాక్టివా, హోండా షైన్ వాహనాలు కండీషన్‌లో ఉన్నాయన్నారు. మరోనాలుగు ద్విచక్రవాహనాలు స్క్రాప్ కండిషన్‌లో ఉన్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి గలవారు ఈనెల 4న ఉదయం 10 గంటల లోగా ధరావతు డబ్బులు డిపాజిట్‌చేసి రసీదు తీసుకోవాలని, ఉదయం 11గంటలకు వేలం జరుగుతుందని తెలిపారు. వివరాలకు కార్యాలయ పని వేళలో ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ధ్రువపత్రాలు పొందే సమయమిదే..

- పై చదువులకు సర్టిఫికెట్లే కీలకం
- ముందస్తుగా పొందితే మేలు



వెల్గటూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఆపై చదువుల కోసం కుల, ఆదాయ, స్థానిక ధ్రువపత్రాలు చాలా కీలకం. వీటిని ఎలా పొందాలో విద్యార్థులు అవగాహన పెంచుకోవడం అవసరం. సకాలంలో ధ్రువపత్రాలు పొందలేకపోతే సంబంధిత కళాశాలల్లో సీటు కోల్పోయే ప్రమాదం ఉంది. జూన్‌లో విద్యా సంవత్సరం మొదలవుతుంది. అందరూ ఒకేసారి దరఖాస్తు చేస్తే వ్యయ ప్రయాసలు, సర్వర్ సమస్యలు ఎదురవుతాయి. చివర్లో హడావుడి పడితే ఒత్తిడికి గురికావాల్సి ఉంటుంది. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు పాలిటెక్నిక్, ఇంటర్, ఐటీఐ వంటి కోర్సుల్లో ప్రవేశాలు పొందుతారు. ఇంటర్ పూర్తి చేసిన వారు బీటెక్, మెడిసిన్, బీఫార్మసీ, ఇతర డిగ్రీ కోర్సుల్లో చేరుతుంటారు. ఇప్పటి నుంచే దరఖాస్తు చేసుకుంటే మేలు అని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.

● అవసరమైన ధ్రువపత్రాలు..

పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఒకటి నుంచి పదో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలతో పాటు చదువులపరంగా గ్యాప్ ఉంటే దానికి సంబంధించి తహసీల్దార్ జారీ చేసిన పత్రం కావాలి. ఆదాయ ధ్రువపత్రాన్ని ఏడాదికి ఒకసారి తీసుకోవాలి. స్థానికత కోసం సంబంధిత బోనఫైడ్లు సమర్పించి దరఖాస్తు చేసుకోవాలి. ఈబీసీ (ఆర్థికంగా వెనుకబడిన వర్గం)కి చెందిన ధ్రువపత్రం కోసం ఆధార్, రేషన్‌కార్డుతో పాటు అఫిడవిట్ జత చేయాల్సి ఉంటుంది. ఫార్మసీ, ఎప్‌సెట్, నీట్‌తో పాటు వివిధ రకాల ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి ఎంట్రన్స్ టెస్ట్ హాల్ టికెట్, అలాట్‌మెంట్ లెటర్, ర్యాంక్ కార్డు, ఒకటి నుంచి ఇంటర్, డిగ్రీ వరకు స్టడీ సర్టిఫికెట్లు, మెమోలు, టీసీ, కుల, ఆదాయ, నివాస ధ్రువ పత్రాలు, ఆధార్ కార్డు, ఫోటోలు అవసరం అవుతాయి. కొన్ని సందర్భాలలో నాన్ క్రిమిలేయర్ సర్టిఫికేట్ కూడా అవసరం పడుతుంది. సమయానికి కులం, ఆదాయం సర్టిఫికెట్లు సమర్పించకపోతే ఫీజు రీయింబర్స్‌మెంట్ కోల్పోయే ప్రమాదం ఉంటుంది.

ధ్రువీకరణ పత్రం	పొందే సమయం	రుసుము
కులం, జననం	30 రోజులు	రూ.45
ఆదాయం	7 రోజులు	రూ.45
నివాసం	7 రోజులు	రూ.45
ఓబీసీ	30 రోజులు	రూ.45
ఈబీసీ	7 రోజులు	రూ.45
స్థానికత	30 రోజులు	రూ.45
ఫ్యామిలీ మెంబర్	30 రోజులు	రూ.45

● ధ్రువపత్రాలు ఎలా పొందాలి..?

కులం, ఆదాయం, నివాసం ధ్రువపత్రాల కోసం సంబంధిత దరఖాస్తు ఫారాలు నింపి ఆధార్, రేషన్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులు మీ సేవా కేంద్రంలో సమర్పించాలి. గ్యాప్ సర్టిఫికెట్ కోసం అఫిడవిట్, పోలీస్ క్లియరెన్స్ స్టడీ సర్టిఫికెట్లు జత చేయాలి. ఒక్కో దానికి రూ.45 మీ సేవలో చెల్లించాలి. ఆర్ఐ, నాయబ్ తహసీల్దార్ పరిశీలించి ఆన్‌లైన్‌లో తహసీల్దార్ లాగిన్‌కు చేరవేస్తారు. తహసీల్దార్ పరిశీలించి డిజిటల్ సంతకం చేస్తారు. అనంతరం విద్యార్థి సెల్‌నంబరుకు మెసేజ్ రాగానే మీ సేవకు వెళ్లి ధ్రువపత్రాలు తీసుకోవాలి.

ముందుగా దరఖాస్తు చేసుకుంటే మేలు

-శేఖర్, తహసీల్దార్, వెల్గటూర్



విద్యార్థులు ఉన్నత చదువులకు కావలసిన ధ్రువీకరణ పత్రాలను ముందుగానే దరఖాస్తు చేసుకుంటే మంచిది. నిర్ణీత వ్యవధిలోనే ధ్రువపత్రాలు అందజేస్తున్నాం. అప్పుడప్పుడు సర్వర్ సమస్యలు వస్తే ఆలస్యం అవుతుంది. పత్రాలు అవసరం ఉన్నప్పుడే హడావుడి పడితే ఒత్తిడికి గురికావాల్సి ఉంటుంది. దళారులను ఆశ్రయించి డబ్బులు వృథా చేసుకోకుండా మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

చెరువులో స్నానానికి వెళ్లి ఒకరి మృతి



మహేష్(ఫైల్)

తిమ్మాపూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండలకేంద్రంలోని ఊరచెరువులో ప్రమాదవశాత్తు పడి ఒకరు మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. గ్రామస్థులుతెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌జిల్లా, పూటూర్ మండలం దంతెనపల్లి గ్రామానికిచెందిన గోనె మహేష్ (35)కు తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన తమ్మ మౌనికకు వివాహం జరిగింది. ఇటీవల అత్తగారింటికి వచ్చిన మహేష్ శనివారం గ్రామశివారులోని ఊర చెరువులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. స్థానికులు చెరువులో ఓ మృతదేహం తేలుతూ కనిపించడంతో ఎల్ఎండీ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై వివేక్ గ్రామస్థుల సహకారంతో చెరువలో నుంచి మృతదేహన్ని బయటకు తీయించారు. మృతుడు గోనె మహేష్‌గా గుర్తించారు. పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం కోసం కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఆటో బోల్తాపడి ఒకరు మృతి

జగిత్యాలరూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలం తక్కళ్లపల్లి గ్రామశివారులో ఆటో బోల్తాపడి బుగ్గారం మండలం వెల్గొండకు చెందిన గంధం రాజన్న(42) అనే ఆటోడ్రైవర్ మృతిచెందినట్లు జగిత్యాలరూరల్ ఎస్ఐ సధాకర్ తెలిపారు. రాజన్న జగిత్యాలలో కూరగాయలు అమ్మేందుకు శనివారం తెల్లవారుజామున తన ఆటోలో వెళ్తుండగా నిద్రమత్తులో నడపడంతో అదుపుతప్పి బోల్తాపడింది. బలమైన గాయంకావడంతో రాజన్న ప్రమాదస్థలిలోనే మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జగిత్యాల రూరల్ ఎస్ఐ సధాకర్ తెలిపారు.

భవనం పై నుంచి పడి మేస్త్రీ మృతి

జగిత్యాల క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలో భవన నిర్మాణ పనులు చేస్తుండగా శనివారం ప్రమాదవశాత్తు కాలు జారి రెండో అంతస్తు నుంచి కింద పడి నస్యూరి సత్యనారాయణ(39) అనే మేస్త్రీ మృతిచెందాడు. పట్టణంలోని తులసీనగర్‌కు చెందిన సత్యనారాయణ నూతనంగా నిర్మిస్తున్న రెండో అంతస్థులో సిమెంట్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడడంతో పొట్టభాగంలో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు పేర్కొన్నారు.

ఉరివేసుకొని ఒకరి ఆత్మహత్య

మానకొండూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపల్కల గ్రామానికి చెందిన కుక్క రమేశ్(40) అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు సీఐ సంజీవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొండపల్కలకు చెందిన రమేశ్ కొంతకాలంగా మద్యానికి బానిసై పని పాటలేకుండా తిరుగుతున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం రాత్రి పడుకున్న రమేశ్ శనివారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు లేచి చూసే సరికి ఇంటిలోని దూలానికి ఉరివేసుకొని మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతి చెందిన తీరును పరిశీలించారు. భార్య లత ఫిర్యాదు మేరకు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని రైలు కిందపడి ఒకరి బలవన్మరణం



సత్యనారాయణ(ఫైల్)

అంతర్గాం, మే 31 (ఆంధ్రజ్యోతి): రామగుండం పట్టణం పాముల పేటకు చెందిన గన్నా సత్యనారాయణ(46) పెద్దంపేట రైల్వేస్టేషన్ పరిధిలో గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘ టన శనివారం చోటుచేసుకుంది. రామగుండం రైల్వే జీఆర్పీ ఇన్‌చార్జి తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం సత్యనారాయణ గతంలో బీథర్మల్‌లో కాంట్రాక్ట్‌కార్మికుడిగా పనిచేశాడు. ప్రస్తుతం వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం ఆర్థికంగా నష్టపోయి మానసికంగా కృంగిపోయాడు. ఈక్రమంలో ఆర్థిక ఇబ్బందులు తాళలేక రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలాన్ని రైల్వే జీఆర్పీ పోలీసులు సందర్శించి శవపంచనామా నిర్వహించి మృతదేహన్ని పోస్టుమార్టం కోసం గోదావరిఖని ప్రభుత్వఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. సత్యనారాయణకు భార్య స్వరూప, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సత్యనారాయణ భార్య ఫిర్యాదుమేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెద్దపల్లిరూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గొళ్లపల్లికిచెందిన కనుకుంట్ల శ్రీనివాస్ (18) చికిత్సపొందుతూ మృతిచెందాడు. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలప్రకారం శ్రీనివాస్ ఇంటర్మీడియట్‌లో ఫెయిల్‌కాగా అప్పటినుంచి ఖాళీగా ఉంటున్నాడు. తల్లి గీత ఖాళీగా తిరగవద్దని సూచించగా మనస్తాపానికి గురై ఏప్రిల్23న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు పెద్దపల్లి అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం ఎంజీఎం వరంగల్ తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడితల్లి గీతఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తుచేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు.

క్రికెట్ లీగ్ పోటీల్లో పెద్దపల్లి, కరీంనగర్ రూరల్ విజయం

కరీంనగర్ స్పోర్ట్స్, మే 31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో కరీంనగర్‌జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న రెండురోజుల ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్‌పోటీలు కొనసాగుతున్నాయి. శనివారం ముగిసిన లీగ్‌పోటీల్లో పెద్దపల్లి, కరీంనగర్ జట్లు విజయం సాధించాయి. కరీంనగర్ టౌన్, జగిత్యాలజట్ల మధ్య మ్యాచ్ డ్రాగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని సెయింట్ అల్ఫోన్స్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన మొదటి మ్యాచ్ హుజూరాబాద్, పెద్దపల్లిజట్ల మధ్య జరిగింది. పెద్దపల్లి జట్టు ఇన్నింగ్స్ 81 పరుగుల తేడాతో విజయం సాధించింది. రెండో మ్యాచ్ జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీ క్రీడా మైదానంలో నిర్వహించగా ఈ మ్యాచ్‌లో కరీంనగర్ టౌన్, జగిత్యాల జట్లు తలపడ్డాయి. జగిత్యాల జట్టును కరీంనగర్ జట్టు ఆలౌట్ చేయకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. వేములవాడలో నిర్వహించిన మూడో మ్యాచ్‌లో సిరిసిల్ల, కరీంనగర్ రూరల్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో కరీంనగర్ రూరల్ జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కరీంనగర్‌టౌన్ జట్టుకు చెందిన అక్షం 132 పరుగులు చేసి నాటౌట్‌గా నిలవడం విశేషం. జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆగమరావు, మురళీధర్‌రావు, ఉపాధ్యక్షులు మహేందర్‌గౌడ్,మనోహర్‌రావుమ్యాచ్‌లను పర్యవేక్షిస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లందకుంట, మే 31 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని రాచపల్లి గ్రామం మీదుగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ట్రైనీఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. జమ్మికుంట మండల పరిధిలోని తనుగుల గ్రామం నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండానే అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. కేసు నమోదు చేసినట్లు ట్రైనీ ఎస్ఐ పేర్కొన్నారు.

నేలకూలిన భారీ వృక్షం.. రెండు వాహనాలు ధ్వంసం

ధర్మారం, మే 31 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న పురాతన చింతచెట్టు శనివారం నేలకూలింది. ఈ సంఘటనలో రెండు జీపులు ధ్వంసమయ్యాయి. ధర్మారం ఆర్టీసీ బస్టాండ్ నుంచి పెద్దపల్లికి కొందరు డ్రైవర్లు 30సంవత్సరాలుగా జీపులు నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. ఇందులో భాగంగా ఎప్పటిలాగే శనివారం ఉదయం రెడపాక లక్ష్మణ్, మదాసు తిరుపతిలు చెట్టు కింద అడ్డాపై జీపులు నిలిపి సమీపంలో మాట్లాడుకుంటున్నారు. ఇంతలో గాలి, వాన ఏమీ లేకుండానే ఒక్కసారిగా భారీ వృక్షం కూలి రెండు జీపులపై పడింది. దీంతో జీపులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ధర్మారం మండల జీపుయూనియన్ అధ్యక్షుడు కాడే సూర్య నారాయణ ఆర్టీసీ అధికారులతో మాట్లాడి చెట్టును తీయించారు. జీపు నడుపుకుంటేనే పూట గడుస్తుందని, వాహనాలు పూర్తిగా దెబ్బతినడంతో 2లక్షల రూపాయల నష్టం జరిగిందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు.



భారీ వృక్షం నేలకూలడంతో దెబ్బతిన్న వాహనాలు

అటవీ భూమిని కబ్జా చేసిన వ్యక్తికి 14 రోజుల రిమాండ్

బీర్‌పూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): అటవీ భూమిని కబ్జా చేసి అటవీ ప్రాంతంలోని జంతువుల కోసం ఏర్పాటు చేసిన నీటి గుంతను ధ్వంసం చేసిన వ్యక్తికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ధర్మపురి రేంజ్ అధికారి శ్రీనాథ్ శనివారం తెలిపారు. బీర్‌పూర్ మండలంలోని రంగసాగర్ గ్రామానికి చెందిన బోడ సాగర్ అనే వ్యక్తి రంగసాగర్ శివారు అటవీ ప్రాంతంలో గల భూమిని కబ్జా చేసి నీటి గుంతను ధ్వంసం చేశాడన్నారు.

సాగర్‌పై అటవీశాఖ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి జగిత్యాల కోర్టుకు అప్పగించగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎఫ్ఆర్‌వో తెలిపారు.

ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● హుజూరాబాద్ సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్

ఇల్లందకుంట, మే 31 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని హుజూరాబాద్ సీనియర్ సివిల్ జడ్జి పీబీ కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని రాచపల్లి గ్రామంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అదే విధంగా జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులను నిషేధించాలన్నారు.

పొగాకు, గుట్కా, అంబర్, పాన్‌మసాలను వాడవద్దని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్, వైస్‌ప్రెసిడెంట్ శ్రీనివాస్, కోశాధికారి భానుకిరణ్, తిరుపతి, రవితేజ, ట్రైనీ ఎస్ఐ దిలీప్‌కుమార్, పంచాయతీ సెక్రెటరీ రాజు తదితరులు పాల్గొన్నారు.



ఇల్లందకుంట మండలం రాచపల్లిలో మాట్లాడుతున్న జడ్జి కిరణ్‌కుమార్

ఐదుగురి బైండోవర్

కరీంనగర్ క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా చేస్తూ గతంలో పోలీసులకు పట్టుబడి, కేసులు నమోదైన ఐదుగురిని శనివారం స్థానిక తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. లక్ష రూపాయల సొంత పూచీకత్తుపై వదిలిపెట్టినట్లు పేర్కొన్నారు. కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల్లో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దుకాణాల్లో మున్సిపల్ అధికారుల తనిఖీలు

● ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం

● రూ.10,500 జరిమానా


కోరుట్ల, మే 31 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని కిరాణ దుకాణాలు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లలో శనివారం మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించి నిలువ ఉన్న ప్లాస్టిక్‌కవర్లను స్వాధీనం చేసుకున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించి నిల్వఉన్న తిను బండారాలను స్వాధీనం చేసుకున్నారు. పలు దుకాణాలు, రెస్టారెంట్ల యజమానులకు రూ.10,500 జరిమానాలు విధించి నట్లు అధికారులు తెలిపారు. ఈ సంద ర్భంగా మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ మాట్లాడుతూ సింగిల్ యూజ్‌ప్లాస్టిక్‌ను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, రాజేంద్రప్రసాద్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మహేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టితవ్వకాల ప్రదేశాన్ని పరిశీలించిన తహసీల్దార్

తిమ్మాపూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలంపల్లి శివారులో 69సర్వేనంబరులో కర్షలగుట్ట వద్ద మట్టి తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని శనివారం అధికారులు పరిశీలించారు. శుక్రవారం గ్రామ స్థులు మట్టిని తరలిస్తున్న టిప్పర్లును పట్టుకొని అధికారులకు అప్పగిం చడం తెలిసిందే. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో శనివారం కథనం ప్రచురితం రావడంతో జిల్లా ఉన్నతాధికారులు మండల అధికారులను నివేదిక కోరారు. దీంతో తిమ్మాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి పోలంపల్లి గ్రామశివారులోని మట్టి, బండరాళ్ల తవ్వకాలు జరుపుతున్న కర్షల గుట్టను పరిశీలించారు. మల్లాపూర్ గ్రామశివారులోని 104సర్వే నెంబరు నుంచి జాతీయ రహదారి నిర్మాణ పనుల కోసం బండరాళ్ల తవ్వకాలకు అనుమతి తీసుకున్నారు. కానీ అక్కడ తవ్వకాలు జరపకుండా పోలంపల్లిలోని 69సర్వే నంబర్‌లో మట్టి, బండరాళ్ల తవ్వకాలు జరుపుతున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా అనుమతి ఒక చోట తవ్వకాలు మరోచోట జరిపినట్లు గుర్తించామని తహసీల్దార్ తెలిపారు. పూర్తినివేదికను ఉన్నతధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. పట్టుకున్నటిప్పర్లు తమ ఆధీనంలోనే ఉన్నాయని తెలిపారు.

ప్రతి పనికి లంచమే..

- అవినీతి ఉద్యోగులపై ఏసీబీ కొరడా
- మొన్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్... నేడు సర్వేయర్



సిరిసిల్ల క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతిపనికి లంచం తప్పనిసరైంది. లంచం ఇవ్వందే ఫైలు కదలడంలేదు. ప్రతి పనికి ఎంతో కొంత ముట్టజెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 22 రోజుల్లో ఇద్దరు అధికారులు ఏసీబీకి చిక్కారు. జిల్లాలో ప్రతి ఏటా పలువురు అధికారులు ఏసీబీ వలలో చిక్కి కటకటాల పాలవుతున్నారు. అయినప్పటికీ లంచం డిమాండ్ చేయడం తగ్గడంలేదు.

● బిల్లు పాస్ చేయడానికి..

రాజన్న సిరిసిల్ల జిల్లా నీటి పారుదలశాఖ ఏడో డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎర్రంరెడ్డి అమరేందర్‌రెడ్డి మే 9న ఓ కాంట్రాక్టర్ వద్ద బిల్ పాస్ చేయడానికి లంచం తీసుకుంటూ కరీంనగర్‌లో ఏసీ బీ వలకు చిక్కాడు. ముస్తాబాద్ మండలంలోని ఆవు నూరు, అగ్రహారం మధ్యలో ఎనిమిది కోట్లతో నిర్మించిన చెక్‌డ్యాం బిల్లుల విడుదలకు హన్మకొండకు చెందిన సూరం రవీందర్ అనే కాంట్రాక్టర్‌ను లక్ష రూపాయలు డిమాండ్ చేయగా 75 వేలకు ఒప్పందం కుదిరింది. ఈ మేరకు కరీంనగర్‌లోని విద్యారణ్యపురి కాలనీలో నివా సం ఉంటున్న ఈఈ అమరేందర్‌రెడ్డి తన ఇంట్లో కాంట్రాక్టర్ రవీందర్ వద్ద 60 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రమణ మూర్తి పట్టుకున్నారు. చెక్‌డ్యాంను రెండేళ్ల క్రితమే పూర్తిచేసినప్పటికీ బిల్లుల మంజూరులో నీటిపారుదలశాఖ అధికారులు అలసత్వం ప్రదర్శించారు. చివరికి 60 వేల లంచం తీసుకుంటూ ఈఈ అమరేందర్‌రెడ్డి ఏసీబీ అధికారులకు చిక్కి కటకటాలపాలయ్యాడు.

● భూమి కొలత ధ్రువీకరణ కోసం రూ. లక్ష డిమాండ్

జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన జక్కాపురం మల్లేషం అనే రైతు తన భూమి కొలతలకు ఎల్లారెడ్డిపేట రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే సర్వేయర్ నాగరాజును ఆశ్రయించాడు. వ్యవసాయ భూమి కొలతలు చేసి పంచనామా ధ్రువీకరణ పత్రం ఇవ్వడానికి సర్వేయర్ నాగరాజు మల్లేశంను లక్ష రూపాయల లంచం డిమాడ్ చేశాడు. దీంతో మల్లేషం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు శనివారం నాగరాజుకు రూ. 15 వేల లంచం ఇస్తుండగా అక్కడే నిఘా వేసిన ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

● అధికారుల ఆస్తులపై ఏసీబీ నజర్

జిల్లాలో 22రోజుల్లో ఇద్దరు అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడంతో వారి ఆస్తులపై ఏసీబీ నజర్ పెట్టింది. ఈ మేరకు ఈఈ అమరేందర్‌రెడ్డి ఆస్తులపై విచారణ చేపట్టింది. సర్వేయర్ నాగరాజు ఆస్తులపై ఏసీబీ విచారణ చేపట్టి అంచనాలు వేస్తోంది. ఆదాయానికి మించి ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయనే కోణంలో ఏసీబీ దర్యాప్తు చేస్తుంది. అయిదేళ్లలో జిల్లాలో పనిచేసిన పంచాయతీరాజ్ శాఖ డీఈఈ మత్స్యశాఖ జూనియర్ అసిస్టెంట్, మునిసిపల్ కమిషనర్, ఫారెస్ట్ రేంజ్ అధికారిని, ఓ సర్వేయర్, ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ ఏసీబీ అధికారుల చేతికి చిక్కి కటకటాలపాలయ్యారు.

● ఉద్యోగ విరమణ రోజు.. లంచగొండి భరతం పట్టి



నిందితుడు నాగరాజు

ఎల్లారెడ్డిపేట: కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఉద్యోగ విరమణ శనివారం ఉన్నా.. ఆయన లంచగొండి అధికారి భరతం పట్టారు. ఆరు గుంటల స్థలానికి కొలతలు వేసి ధ్రువీకరణ పత్రం అందించేందుకు మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతు జక్కపురం మల్లేశం వద్ద సర్వేయర్ నాగరాజు రూ.లక్ష డిమాండ్ చేశాడని బాధిత రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దాంతో డీఎస్పీ రమణమూర్తి ఉద్యోగ విరమణ ఉన్నా రంగంలోకి దిగి పట్టుకున్నారు.

పదేళ్లలో సబ్‌ప్లాన్ నిధులు ఖర్చు చేయలేదు

» మేం వచ్చాక 17,169కోట్ల కేటాయింపు

» గిరిజనుల హక్కులు కాపాడేలా నల్లమల్ల డిక్లరేషన్ ఇచ్చాం: భట్టి విక్రమార్క

» గిరిజనుల హక్కులను రక్షించాలి: మీనాక్షి

కొత్తగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లలో రాష్ట్రాన్ని పాలించిన బీఆర్‌ఎస్ సర్కారు గిరిజనుల కోసం సబ్‌ప్లాన్ నిధులను ఏ మాత్రం ఖర్చు చేయలేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.17,169కోట్లను కేటాయించామని డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కిన్నెరసానిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కాంగ్రెస్ తెలంగాణ ఆదివాసీ కార్యకర్తల సమ్మేళనం ముగింపు సమావేశం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వంలో సబ్‌ప్లాన్ నిధులను పారదర్శకంగా ఖర్చు చేస్తున్నామని చెప్పారు. గిరిజనుల అవసరాలేంటో తెలుసుకునేందుకు ఆ వర్గాలకు చెందిన నాయకులను ఒకచోట చేర్చి శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. అడవి బిడ్డలు ఆత్మగౌరవంతో జీవించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా సౌర జల గిరిజన వికాస పథకం తీసుకొచ్చిందని వెల్లడించారు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు నల్లమల్ల డిక్లరేషన్ తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నాటరాజన్ మాట్లాడుతూ.. గిరిజనుల చట్టాలను, హక్కులను పరిరక్షించి వారిని అన్నిరంగాల్లో ముందు వరుసలో నిలపాలన్నారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులన్నీ పరిరక్షించినప్పుడే వారు అభివృద్ధిలో ముందుకు వెళ్తారని, దీనికోసం కాంగ్రెస్ ఎల్లప్పుడు కృషి చేస్తుందన్నారు. పోడు భూముల్లో సాగు చేసుకుని జీవనం సాగించేందుకు అడవి బిడ్డలకు ఆర్థికంగా చేయూతనందించాలనిసూచించారు. పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనుల అభివృద్ధి, వారి సంక్షేమం కోసం రూ.కోట్లాది నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నాడు ఇందిరాగాంధీ నుంచి ఇప్పటి సోనియాగాంధీ వరకు గిరిజనుల అభివృద్ధికోసం,వారిని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తామని తెలిపారు.



పాల్వంచలో ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల సమ్మేళనంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

రాష్ట్రంలో విలువైన ప్రభుత్వ భూములను కాపాడేందుకు భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు.

ప్రభుత్వ పనితీరుపై మీనాక్షి ఆరా

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మీనాక్షి నటరాజన్ శనివారం పాల్వంచలోని జెన్కో అతిథిగృహంలో అంతర్గత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ ఒక్కో ఎమ్మెల్యేతో వేర్వేరుగా మాట్లాడి.. వారి నియోజకవర్గాల్లో రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరుపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. ఈ క్రమంలో ఆయా ఎమ్మెల్యేలు ప్రభుత్వ పని తీరు బాగానే ఉందని, రుణమాఫీ, రైతు బంధు పథకం అందరికీ అందలేదన్న వ్యతిరేకత కొంత ఉందని ఆమె వివరించినట్టు తెలిసింది.

కొందరు బీజేపీ సీనియర్లతో కేసీఆర్‌కు సంబంధాలు



» ఆ కారణంగానే పార్టీ అధ్యక్ష పదవి నుంచి బండిని తప్పించారు

» గత ఎన్నికల్లో కేసీఆర్ చెప్పిన వారే బీజేపీ అభ్యర్థులు: మహేశ్ గౌడ్

కొత్తగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం కుదిరిందని, కొందరు బీజేపీ సీనియర్ నాయకులతో కేసీఆర్‌కు సంబంధాలున్నాయని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఆ సంబంధాల కారణంగానే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి బండి సంజయ్‌ను తొలగించారన్నారు. రేపో.. మాపో.. బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనం కావడం ఖాయమని జోస్యం చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కిన్నెరసాని గురుకుల పాఠశాల ఆవరణలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదివాసీ గిరిజన కాంగ్రెస్ సమ్మేళనం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మహేశ్ గౌడ్ మాట్లాడారు. 'బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ చెప్పినట్టే గత ఎన్నికల్లో కేసీఆర్ చెప్పినట్టుగానే బీజేపీ తమ అభ్యర్థులను నిలబెట్టింది. బీజేపీకి తెలంగాణలో పునాదులు లేవు.. ఆ పార్టీ ఇక్కడ అధికారంలోకి రావడం కలే.. రాష్ట్రంలో కాంగ్రెస్ బలంగా ఉంది. అన్ని వర్గాల ప్రజలకు చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పార్టీ బలోపేతమవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల వల్ల.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తప్పనిసరిగా కాంగ్రెస్ 90 సీట్లు గెలుచుకుంటుంది' అని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్.. ఒక్కటేనని బీజేపీ నేతలు చేస్తున్న ఆరోపణల్లో ఏ మాత్రం నిజం లేదని కొట్టిపారేశారు. బండి సంజయ్ మాటలను ప్రజలు నమ్మడం లేదని, ఆయన ఇంకా యువ మోర్చా నాయకుడిలా మాట్లాడటం సరికాదన్నారు.

అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ అభివృద్ధే లక్ష్యం: కేటీఆర్

హైదరాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ అభివృద్ధి చెందాలన్నదే తమ అభిమతమని, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఇంగ్లాండ్‌లోని వార్విక్ యూనివర్సిటీలో ప్రాగ్మటిక్ డిజైన్ సొల్యూషన్స్ లిమిటెడ్ (పీడీఎస్‌ఎల్) నాలెడ్జ్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దిగ్గజ కార్పొరేట్ సంస్థలకు తెలంగాణ బిడ్డలు సేవలందించడం గర్వకారణం అన్నారు. పెట్టుబడులు వచ్చి తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు దొరకాలని, అందుకోసం సర్వశక్తులు ఉపయోగిస్తామని చెప్పారు.

కేసీఆర్‌కు నోటీసులంటే.. తెలంగాణకు ఇచ్చినట్లే

ఆయనపై ఈగ వాలినా ఊరుకోం.. కాళేశ్వరం కమిషన్ నోటీసులకు వ్యతిరేకంగా 4న ఇందిరాపార్క్ వద్ద ధర్నా

» జాగృతి నూతన కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్.. తెలంగాణ జాతిపిత అని, ఆయనకు నోటీసులు ఇవ్వడమంటే యావత్తు తెలంగాణకు నోటీసులిచ్చినట్లేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కేసీఆర్‌పై ఈగ వాలినా తాము ఊరుకోబోమని హెచ్చరించారు. కేసీఆర్‌కు బీఆర్‌ఎస్ పార్టీ ఒక కన్ను అయితే.. తెలంగాణ జాగృతి మరో కన్ను అని తెలిపారు. కాళేశ్వరం కమిషన్ కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈ నెల 4న ఇందిరా పార్కు వద్ద మహాధర్నా చేపడుతున్నట్లు ప్రకటించారు. శనివారం బంజారాహిల్స్‌లోని తన నివాసం సమీపంలో తెలంగాణ జాగృతి నూతన కార్యాలయాన్ని కవిత ప్రారంభించారు. కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించిన అనంతరం బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గోదావరి జలాల్లో 200 టీఎంసీల హక్కు తెలంగాణకు ఉండాలని కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని తెలిపారు. "కాళేశ్వరం ద్వారా ఏటా 20 లక్షల ఎకరాలకు నీళ్లు అందించినందుకు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారా? కోటి ఎకరాల మాగాణంగా తెలంగాణను చేసిందుకు నోటీసులు ఇచ్చారా ? రైతు బీమా, రైతు బంధు పథకాలను ప్రవేశపెట్టినందుకు ఇచ్చారా? తెలంగాణ ప్రజలకు మేలు చేసినందుకు ఇచ్చారా? అది కాళేశ్వరం కమిషనా? లేక కాంగ్రెస్ కమిషనా?"అని కవిత ధ్వజమెత్తారు. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం పట్ల ప్రతి తెలంగాణ బిడ్డ బాధపడుతున్నారని అన్నారు.

నీళ్లు తరలించుకుపోతుంటే మాట్లాడరేం?

ఏపీ సీఎం చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టు నిర్మించి తెలంగాణ నీళ్లను తరలించుకుపోతుంటే సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడని పరిస్థితి ఏర్పడిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం అంత బలహీనంగా ఎందుకున్నారని, పక్క రాష్ట్రాల ప్రయోజనాల కోసం ఎందుకు పనిచేస్తున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు నదుల అనుసంధానాన్ని తుపాకులగూడెం నుంచి చేపట్టేలా ప్రతిపాదించారని, కానీ.. ఆనాడు కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోకుండా ఇచ్చంపల్లి నుంచి చేపడతామని చెప్పిందని అన్నారు. కానీ, ఇప్పుడు పోలవరం నుంచి 200 టీఎంసీల గోదావరి నీళ్లను తరలించే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. జూన్ 2 నాడు సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశంపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కనీసం జై తెలంగాణ అనకపోవడం మన ఖర్మ అని, తెలంగాణ గ్రహచారం బాగాలేక రాష్ట్రానికి రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని కవిత వ్యాఖ్యానించారు. జై తెలంగాణ అనని వారికి, అమరవీరులకు నివాళులర్పించని వారికి సీఎం కుర్చీలో కూర్చొనే అర్హత లేదన్నారు. ఇప్పటికైనా రేవంత్ జై తెలంగాణ అనాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పిడికిలెత్తి బయటికి వస్తేనే తెలంగాణ వచ్చిందని, దానివల్లే ఇవాళ అధికారంలో ఉన్నామన్న విషయాన్ని వారు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఆ విషయాన్ని మరిచిపోయి కేసీఆర్‌కు నోటీసులివ్వడం దారుణమన్నారు. యువతకు స్వయం ఉపాధి కోసం ప్రారంభిస్తున్న రాజీవ్ యువ వికాసం పథకం పేరు మార్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు ఎటువంటి సంబంధంలేని రాజీవ్‌గాంధీ పేరు పెట్టడం సరికాదన్నారు. అమరులు శ్రీకాంతచారి, యాదిరెడ్డి, ప్రజాకవి కాళోజీ, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరు పెట్టాలని సూచించారు. రాష్ట్ర శాసనసభ, శాసన మండలి ఆమోదించిన బీసీ బిల్లులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆమోదించకుండా తాత్సారం చేస్తోందని కవిత మండిపడ్డారు.


జాగృతి కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పూజలు చేస్తున్న కవిత

ఇటీవల ప్రధాని మోదీని సీఎం రేవంత్ రెడ్డి కలిసిన సమయంలో ప్రాజెక్టుల గురించి మాట్లాడారు తప్ప.. బీసీ బిల్లు మీద మాట్లాడలేదని ఆరోపించారు. బీసీ బిల్లును డీప్ ఫ్రిడ్జ్‌లో పెట్టే ప్రయత్నం చేస్తే బీజేపీకి సెగ తాకేలా పోరాటం చేస్తామని హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే వరకు జాగృతి పోరాటం చేస్తుందని అన్నారు.

జాగృతి కమిటీల ఏర్పాటు..

మైనారిటీల హక్కుల కోసం కూడా జాగృతి పోరాటం చేస్తుందని కవిత ప్రకటించారు. జాగృతిలో మైనారిటీల హక్కుల కోసం ముస్లిం, సిక్కు, క్రిస్టియన్ విభాగాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జాగృతి తరఫున ఎస్సీ, ఎస్టీ విభాగాన్ని ఏర్పాటు చేసి ఆ వర్గాల కోసం ఉద్యమిస్తామన్నారు. అయితే, తాము పోరాటాలు చేస్తుంటే కొంతమంది ఓర్వడం లేదన్నారు. తెలంగాణ కోసం బీజేపీ నాయకులు మాట్లాడకపోవడం దారుణమని, 8మంది ఎంపీలను గెలిపించినా కేంద్రం నుంచి రూపాయి తీసుకురాలేదని విమర్శించారు. గోదావరి జలాల్లో తెలంగాణ వాటాను కాపాడకపోతే తెలంగాణ జాగృతి పవర్ చూపిస్తామన్నారు. కాగా, తెలంగాణ జాగృతి కార్యాలయ కార్యదర్శిగా పొన్నమనేని బాలాజీరావును నియమిస్తున్నట్లు ఆ కార్యాలయం తెలిపింది.

బీజేపీతో పొత్తు ఉంటుందని ఏమార్చారు

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లోకి.. వచ్చినప్పుడల్లా కేసీఆర్ ఇదే చెప్పారు: సంజయ్



కరీంనగర్, మే 31(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): గతంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీలోని చాలా మంది ఎమ్మెల్యేలు బీజేపీతో టచ్‌లోకి వచ్చారని.. అలా జరిగిన ప్రతిసారీ కేసీఆర్ ఎమ్మెల్యేలతో సమావేశమై కమలంతో పొత్తు పెట్టుకుంటామని చెప్పి వారిని కాషాయ గూటికి రాకుండా చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. బీఆర్‌ఎస్ అంటేనే అవినీతి పార్టీ అని, కవితను అరెస్టు చేయకుండా ఉండటానికి బీజేపీతో కలవడానికి బీఆర్‌ఎస్ ప్రయత్నించిందని చెప్పారు. కుటుంబ పార్టీని తాము దగ్గరకు రానివ్వలేదని తెలిపారు. శనివారం కరీంనగర్‌లో సంజయ్ విలేకరులతో మాట్లాడారు. ఈటల రాజేందర్, హరీశ్‌రావు భేటీ విషయం తెలియదని, ఇదంతా కాంగ్రెస్ ఆడుతున్న డ్రామా అని తెలిపారు. కవిత విషయంలోనూ అదే డ్రామా నడుస్తోందని చెప్పారు కల్వకుంట్ల ఆర్ట్స్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నిర్మాణ దర్శకత్వంలో కవిత పాత్రధారిగా చార్‌పత్తా సినిమా నడుస్తోందన్నారు. కవిత ఎపిసోడ్‌తో ప్రజలకు మేలు జరుగుతుందా..? అని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలపై చర్చ జరగకుండా చిట్‌చాట్‌ల పేరుతో ప్రజల దృష్టిని మళ్లించే కుట్ర జరుగుతోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ముమ్మాటికీ దేశద్రోహమే అని సంజయ్ అన్నారు. సైన్యం ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా, పాకిస్తాన్ ఉగ్రవాదులను పెంచి పోషించేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ అవినీతి, కాళేశ్వరం ప్రాజెక్టు, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్, ఫాంహౌస్, ఫార్ములా-ఈ రేసు కేసుల విషయంలో అరెస్టులు ఉంటాయని చెప్పి కాంగ్రెస్ మాట తప్పిందని అన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కలిసి బీజేపీని అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని చూస్తున్నాయని, వాళ్లెన్ని కుట్రలు చేసినా అది జరగదని చెప్పారు. వేములవాడ రాజన్న ఆలయ పరిధిలో 18 గోవులు చనిపోవడంపై అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరికాదని సంజయ్ అన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

● సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్


పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడుతున్న జడ్జి దుర్గం గణేష్

సుల్తానాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, వ్యసనాలకు బానిసలైన వారిని కాపాడే బాధ్యతను తల్లిదండ్రులు, గురువులు, సమాజం తీసుకోవాలని సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్ పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గర్రెపల్లి పంచాయతీ ఆవరణలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. జడ్జి మాట్లాడుతు ధూమపానం, పొగాకు ఉత్పత్తులను సేవిండం ద్వారా శారీరక మానసిక ఆరోగ్యానికి కలిగే ప్రమాదాలు నష్టాల గురించి వివరించారు. అనంతరం పొగాకు, డ్రగ్స్ కల్తీ కల్లుపై అప్రమత్తంగా ఉండేలనే నినాదాలతో కూడిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరిస్తామంటూ పాల్గొన్న వారిచే ప్రతిజ్ఞ చేయించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతిరెడ్డి, ప్రధానకార్యదర్శి భూమయ్య, ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి నేరెళ్ల శంకరయ్య, లోక్ అదాలత్ మెంబర్స్ మాదూరి ఆంజనేయులు, న్యాయవాదులు ఆవుల శివకృష్ణ, గుడ్ల వెంకటేశ్, రుద్రారపు నర్సయ్య, పడాల అంజయ్య, నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో ఎస్‌ఐ, నాయకులు పాల్గొన్నారు.

కోడెల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

● గోశాలను తనిఖీ చేసిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన అధికారులు


కోడెను పరిశీలిస్తున్న కలెక్టర్

వేములవాడ కల్చరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి గోశాలలోని కోడెల సంరక్షణపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని అధికారులను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ గోశాలలోని రాజన్నకోడెలపై శనివారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'కోడె గోస చూడు.. రాజన్నా..' అనే కథనానికి అధికారులు స్పందించారు. గోశాలలోని కోడెలను శనివారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆకాల వర్షాలు, అనారోగ్య కారణాలతో ఎనిమిది కోడెలు చనిపోయాయని తెలిపారు. పశువైద్యాధికారుల ఆధ్వర్యంలో కోడెలకు నిరంతరం వైద్యం అందిస్తున్నామని తెలిపారు.

● సామర్థ్యానికి మించి కోడెలు ఉండడంతోనే సమస్య

- దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్‌రావు

వేములవాడ రాజన్న ఆలయ తిప్పాపూర్ గోశాలను దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్‌రావు పరిశీలించారు. అనారోగ్యంతో వున్న కోడెల శాంపిల్‌ను సేకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ గోశాలలో సామర్థ్యానికి మించి కోడెలు ఉండడంతో సమస్యలు వస్తున్నాయన్నారు. అనారోగ్యంతో వున్న కోడెలను వేరుగా ఉంచాలన్నారు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని తెలిపారు. మరో మూడు షెడ్లను నిర్మిస్తున్నామన్నారు. ఆయనవెంట దేవాదాయ జాయింట్ కమిషనర్ కృష్ణప్రసాద్, వెటర్నరీ వైద్యులు విజయభాస్కర్‌రెడ్డి, ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ ఉన్నారు.

మరో ఐదు కోడెల మృతి

రాజరాజేశ్వరస్వామి గోశాలలో శుక్రవారం అర్ధరాత్రి మరో 5 కోడెలు మృతి చెందినట్లు తెలుస్తోంది. రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు గోశాల తనిఖీ వస్తున్నట్లు తెలుసుకున్న గోశాలసిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా కళేబరాలను తరలించి ఖననం చేసినట్లు సమాచారం. ఈ విషయంపై అధికారులను సంప్రదించగా శనివారం కోడెలు మృతి చెందలేదని తెలిపారు.

నేడు చిన్న కోడెల పంపిణీ

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

రాజరాజేశ్వర స్వామి వారి తిప్పాపూర్ గోశాలలోని 300 చిన్న కోడెలను ఆదివారం పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టాదారు పుస్తకాలు ఉన్న రైతులకు జియో ట్యాగింగ్ ఉన్న చిన్న కోడెలను పంపిణీ చేస్తామని, రైతులు వాటి సంరక్షణను సక్రమంగా చూసుకోవాలని సూచించారు.

నరసింహుని సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, మే 31 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిక్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శనివారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. అనుబంధఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


స్వామి వారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

యువకుడు అదృశ్యం.. కేసు నమోదు


లక్ష్మణ్ (ఫైల్)

మానకొండూర్, మే 31 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్ మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన రామగిరి లక్ష్మణ్ (21) అనే యువకుడు కనిపించకుండా పోయాడని శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు అయింది. సీఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. అన్నారం గ్రామానికి చెందిన రామగిరి లావణ్య-అంజయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక్క కుమార్తె ఉన్నారు. రెండవ కుమారుడు లక్ష్మణ్ పదవతరగతి వరకు చదువుకున్నాడు. ఈనెల 27న రాత్రి 8.30గంటల ప్రాంతంలో ఇంటినుంచి బయటికి వెళ్లిన అతడు తిరిగిరాలేదు. అతనికోసం చుట్టుప్రక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా జాడ తెలియలేదు. అతడి తండ్రి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నంబాల కేశవరావు మృతిపై విచారణకు ఆదేశించాలి

● చర్చలకు కేంద్రం పెద్దన్న పాత్ర పోషించాలి ● పాకిస్తాన్ నమ్మదగిన దేశం కాదు

● నిత్యం అప్రమత్తంగా ఉండాల్సిందే

● సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

సుల్తానాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో అనేక విషయాలు వెలుగు చూస్తున్నాయని, ఎన్‌కౌంటర్ కాదని అతడిని పట్టుకుని కాల్చి చంపారనే చర్చ కొనసాగుతుందని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు, మాజీఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామంలో శనివారం సీపీఐ మండల మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కేశవరావు మృతి విషయంలో జ్యూడిషియల్ విచారణకు ఆదేశించాలని డిమాండ్‌చేశారు. మావోయిస్టులను హతమారుస్తున్న ప్రభుత్వం వారి సిద్ధాంతాలను ఏమీ చేయలేరని, అవి సజీవంగా ఉంటాయని అన్నారు. హతమార్చడం సమస్యకు పరిష్కారం కాదని కేంద్రం పెద్దన్నపాత్ర పోషించి మావోయిస్టులను చర్చలకు ఆహ్వానించాలన్నారు. మీరు అనుకున్న సన్మార్గం వైపు తీసుకువచ్చే ప్రయత్నం చేయాలే తప్ప ఎన్‌కౌంటర్లు సరికాదన్నారు. ఉగ్రవాద దేశమైన పాకిస్థాన్‌తో చర్చలు జరుపుతున్న కేంద్ర పెద్దలు మన దేశపు బిడ్డలతో మాట్లాడలేరా అని ప్రశ్నించారు. భారత్-పాకిస్థాన్ యుద్ధం ఆగినా ఉగ్రవాదం కొనసాగుతుందని, పాక్ నమ్మదగిన దేశం కాదని, మనదేశంలోని సైనిక వ్యవస్థలు, కేంద్రం అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు లేక అభివృద్ధికి నిధులు లేక కుంటుపడ్డాయన్నారు. స్థానిక సంస్థలకు పూర్తి స్వయం ప్రతిపత్తి కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ పార్టీ శత జయంతి ఉత్సవాలలో భాగంగా దేశ వ్యాప్తంగా గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. సంస్థాగత ఎన్నికల నిర్వహణలో భాగంగా గల్లీ నుంచి ఢిల్లీ వరకు కొత్తకమిటీలు పూర్తిచేసి సెప్టెంబర్ 21నుంచి 26వరకు పంజాబ్‌లోని చండీ గఢ్‌లో జాతీయ సభలు జరుపుతామన్నారు. ఆగస్టులో మేడ్చల్‌లో రాష్ట్ర సభలు, జూన్28నపెద్దపల్లిజిల్లా మహసభలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు కలవేనశంకర్, సీపీఐజిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, ఏఐటియుసి జిల్లా జనరల్ సెక్రటరీ కడారి సునిల్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

కొండగట్టులో భక్తుల సందడి


ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, మే 31 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగావచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకపూజలు, సత్యనారాయణ వ్రతాలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

● ఎస్పీకి ఆలయ అధికారుల సన్మానం

ఇటీవల జరిగిన పెద్దహనుమాన్ జయంతి సందర్భంగా పోలీస్‌శాఖ తరుపున అన్నిశాఖల అధికారులను సమన్వయంచేస్తూ ఉత్సవాలు విజయవంతానికి కృషిచేశారంటూ ఎస్పీ అశోక్‌కుమార్‌ను ఈవో శ్రీకాంత్‌రావు ఇతర అధికారులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్పీని సత్కరించి స్వామి వారి ప్రసాదాలు అందజేశారు. ఈవో వెంట పర్యవేక్షకులు సునీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

భూధార్ ఉంటేనే కేంద్ర పథకాల వర్తింపు

(5వ పేజీ తరువాయి)


కొలనూర్‌లో వివరాలు నమోదు చేస్తున్న ఏఈఓ

తీసుకున్న నిర్ణయం మేరకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది.

భూముల వివరాలు నమోదు

వ్యవసాయశాఖ రైతువేదికలతోపాటు ఏఈవోలు ముందస్తుగా రైతులకు సమాచారం ఇచ్చి గ్రామాలకు వెళ్లి కూడా భూధార్ కోసం వివరాలను ముమ్మరంగా నమోదు చేస్తున్నారు. ఫార్మర్ రిజిస్ట్రీలో వివరాలను నిక్షిప్తం చేస్తున్నారు. రైతులు వ్యవసాయ శాఖ ఏఈవోల వద్దకు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు బుక్, అడంగల్ పహాణీ, ఆధార్ లింక్ అయిన మొబైల్ ఫోన్ తీసుకెళ్లాలి. భూభారతి పోర్టల్, రికార్డ్స్ ఆఫ్ రైట్స్, పట్టాదారు పాస్ పుస్తకాల ఆధారంగా రైతుల యాజ మాన్య హక్కులను నిర్ధారించి వివరాలను నమోదు చేస్తారు. ఆ తర్వాత 11 అంకెల విశిష్ట సంఖ్యను కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తుంది. భూధార్ ఐడీ నంబర్ ఆధారంగా కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీఎం కిసాన్ యోజన, బీమా, ఈజీఎస్ పనులు, మొక్కల పెంపకం మంజూరు చేయనున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వ పథకాలైన రైతు భరోసా, రుణమాఫీ, తదితర పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రీకి ఏ రకమైన సంబంధం లేదని జిల్లా వ్యవసాయశాఖ అధికారి దోమ ఆదిరెడ్డి తెలి పారు. జిల్లాలో రెవెన్యూ రికార్డుల్లో మ్యాపింగ్ కాని భూములు, రెండు పాస్ పుస్తకాలు కలిగిన రైతులు, ఇతర రాష్ట్రాలకు చెందిన రైతులకు భూధార్ ఐడీ నంబర్ కేటాయింపు ప్రక్రియను నమోదు చేయడం లేదని అధికారులు చెబుతున్నారు. పట్టాలు కలిగిన రైతులు ఏఈవోల వద్ద భూముల వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. జిల్లాలో కౌలు రైతులతోపాటు అసైన్డ్, దేవాదాయ భూములు, అటవీ భూములు సాగు చేసుకునే చాలామంది రైతులకు నేరుగా యాజమాన్య హక్కులు లేవని, వీరం దరికీ కూడా కేంద్ర పథకాలు వర్తించే విధంగా భూధార్ కార్డులను ఇవ్వాలని రైతు సంఘాల నాయ కులు కోరుతున్నారు.

పొగాకు వినియోగంతో అనారోగ్యం


సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసరావు

కోల్‌సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): పొగాకు వినియోగం ప్రమాదకరమని గోదావరిఖని అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి డాక్టర్ టీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం పురస్కరించుకుని మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు సిబ్బందికి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా యేటా లక్షలాది మంది కేన్సర్ బారిన పడుతున్నారన్నారు. పొగాకు వినియోగించడం వల్ల కేన్సర్‌కు గురై మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ పొగాకు దుష్ప్రరిణామాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. రెండవ అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ వెంకటేష్ గురువ, అదనపు జిల్లా న్యాయస్థాన పరిపాలనాధికారి శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్లు శ్రీధర్, విజయసారధి, లూర్థు పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం పురస్కరించుకొని బేగంపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఇల్లటం ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ చేపట్టారు. పొగాకు సేవనం ద్వారా జరిగే అనారోగ్య సమస్యలపై గ్రామంలో అవగా హన కల్పిస్తూ పొగాకు దూరంగా ఉండాలని సూచిం చారు. తొలుత పొగాకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయిం చారు. సిహెచ్‌వో భరత్, హెచ్‌ఈ సీతారామయ్య, హెచ్‌వి పుష్పలత, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్, ఏఎన్ ఎం మనమ్మ, స్టాఫ్‌నర్సులు రమాదేవి, స్వప్న, ఉమాదేవి పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): కొలనూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పొగాకు వ్యతిరేక దినంలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం పొగాకును నిషేధించాలని, పొగాకుకు బానిసలు అయితే కేన్సర్ బారిన పడి మరణిస్తారని తెలిపారు. అనంతరం వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ నిర్వహించారు. డాక్టర్ సంజనేష్ కుమార్ తో పాటు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


ఎలిగేడులో పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ


ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): పొగాకు వాడకాన్ని తగ్గించి అనారోగ్య సమస్యలను అధిగమించాలని పీహెచ్‌సీ వైద్యురాలు నిస్సిక్రిష్టాన అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్‌చౌక్‌లో స్లోగన్స్ చేశారు. పొగాకు వల్ల చాలా అనర్థాలు కలుగుతాయని కేన్సర్, టీబీ ఇతరత్రా దీర్ఘకాలిక వ్యాధులు సంక్రమిస్తాయని తెలిపారు. ఆయుష్ వైద్యులు కేశవరెడ్డి, సూపర్‌వైజర్ నాగమణి, ఏఎన్ఎంలు, ఆశాలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోల్‌సిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్టాండ్ వద్ద రాజీవ్ రహదారి పక్కన సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, గట్ల రమేష్ నిర్మాణ పనులను ప్రారంభించారు. గోదావరిఖని బస్టాండ్ నుంచి మున్సిపల్ జంక్షన్, శారదానగర్ నుంచి ఇల్లందు జంక్షన్ వరకు ఈ రోడ్డు నిర్మాణం జరుగనున్నది. బస్టాండ్ వద్ద నష్టపోయిన వ్యాపారులకు రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బస్టాండ్ కాలనీ వైపు ప్రత్యామ్నాయ స్థలాలను కేటాయించారు. ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించడంపై వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. వ్యాపారులు నష్టపోకుండా ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించినట్టు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేస్తారన్నారు. అవసరమైన ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ చేసి ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు విస్తరణ, నిర్మాణంతోపాటు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోనున్నట్టు వారు పేర్కొన్నారు. సర్వీస్ రోడ్డు లేకపోవడం వల్ల వందల మంది ప్రాణాలు పోగొట్టుకున్నారని, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని నాయకులుపేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్ ముస్తాఫా, దూళికట్ట సతీష్ పాల్గొన్నారు.

ఖరీఫ్ పంటలపై నేడు అవగాహన

పెద్దపల్లి రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి రైతువేదిక, రాగినేడు, కనగర్తి గ్రామాల్లో ఆదివారం ఖరీఫ్ పంటలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి అలివేణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటలకు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం రామగిరి ఖిల్లా ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో ప్రధానంగా ఖరీఫ్ సీజన్‌లో రైతులను వ్యవసాయపరంగా సాంకేతిక సలహాలు సూచనలు అందించనున్నట్లు తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ ఉద్యానవన శాఖ అధికారులతో వ్యవసాయ అధికారులు పాల్గొంటారని తెలిపారు. సమావేశాలకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మల్లన్న సన్నిధిలో జడ్జి పూజలు

ఓదెల, మే 31 (ఆంధ్రజ్యోతి): భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో శనివారం నిజామాబాద్ జిల్లా బోధన్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి సాయి శివ పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో సదయ్య, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈవో జడ్జిని సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

ఉపాధ్యాయులు సర్దుబాటు

ప్రాథమిక విద్యకు గొడ్డలిపెట్టు

పెద్దపల్లి కల్చరల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి కలెక్టర్లకు అధికారమిస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విడుదల చేసిన ఉత్తర్వులు ప్రాథమిక విద్యకు గొడ్డలి పెట్టు అని, వెంటనే విరమించుకోవాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామ్‌కిషన్‌రావు, సంతోష్‌రెడ్డిలు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పిల్లలు తక్కువగా ఉన్నారన్నా ఉద్దేశంతో టీచర్లను వేరే పాఠశాల లకు సర్దుబాటు చేయడం ద్వారా ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలలపై తీవ్రమైన ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రాథమిక పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయుల ఉండాల్సి ఉండగా, పదిమంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు, అదేవిధంగా 60 మంది విద్యార్థుల వరకు ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉండాలనడం పూర్తిగా అసంబద్ధమన్నారు. ఈచర్యలన్ని ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రైవేటుకు అప్పగించే విధానాలే అన్నారు. ఉన్నత పాఠశాలల్లో కూడా సెక్షన్‌ల వారీగా ఉపాధ్యాయుల సంఖ్య నిర్ణయించాలని, భాషా ఉపాధ్యాయులను విద్యార్థుల సంఖ్య ఆధారంగా కాకుండా సెక్షన్‌ల ప్రకారం చూడాలన్నారు. విద్యారంగానికి బడ్జెట్ పెంచి అవసరమైన మేరకు ఉపా ధ్యాయుల నియామకం, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లి కల్చరల్, మే 31 (ఆంధ్రజ్యోతి):బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశాలకు ఈనెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ శనివారం ఒకప్రకటనలో తెలి పారు. 2025-26సంవత్సరానికి జిల్లాలో గల బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (రెసిడెన్షియల్, నాన్‌రెసిడెన్షియల్)క్రింద పాఠశాలల్లో ఒకటవ తరగతి, (నాన్‌రెసిడెన్షియల్‌లో(70)సీట్లు, 5వ తరగతి రెసిడెన్షియల్‌లో (73)సీట్లు కేటాయించారని తెలిపారు. లాటరీ పద్ధతిన, రిజర్వేషన్ ప్రకారం విద్యార్థు లకు సీట్లు కేటాయింపు ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. దరఖాస్తు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో లభిస్తుందని, కులం, ఆదాయం, నివాసం, రేషన్‌కార్డు, 3పాస్‌పోర్ట్‌సైజు ఫోటోలు, ఆధార్‌కార్డు పత్రాలతో సమర్పించాలని సూచించారు. 2019జూన్ 1వ తేదీనుండి 2020మే 31తేదీ మధ్య జన్మించినవారు అర్హులని, ఒక కుటుంబం నుండి ఒకరికి మాత్రమే ప్రవేశ అర్హత ఉంటుందని, వివరాలకు 9014327045 సంప్రదించాలని జిల్లా షెడ్యూల్డ్ కులంల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ ఆప్రకటనలో పేర్కొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న తాండ్ర సదానందం

కళ్యాణ్‌నగర్, మే 31(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం మారణకాండను సృష్టిస్తుందని, ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎర్ర జెండాను అంతం చేయడం ఎవరితరం కాదని, ఛత్తీస్‌గఢ్‌లో ఆపరేషన్ కగార్ పేరుతో అమాయకులైన ఆదివాసీలను, గిరిజనులను హత్య చేస్తూ ఖనిజ సంపదను అదాని, అంబానీలకు దోచి పెట్టేందుకు ప్రధాని నరేంద్రమోదీ, అమిత్‌షా ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐని గెలిపించాలని, వందేళ్ల చరిత్ర గల సీపీఐ పార్టీ అనేక పోరాటాలు చేసిందని, కార్మికులకు, కర్షకులకు, రైతులకు వెన్నంటే ఉండేది సీపీఐ అన్నారు. అనంతరం సీపీఐలో 50 సంవత్సరాలుగా పని చేస్తున్న ఆసాల మధునయ్యను సన్మానించారు. సీపీఐ నగర అధ్యక్షుడు కే కనకరాజు, నాయకులు తాళ్లపల్లి మల్లయ్య, శనిగరపు చంద్రశేఖర్, మార్కపురి సూర్య, రేణికుంట్ల ప్రీతం, మల్లేష్, రమ, లెనిన్, నవీన్, రమేష్‌కుమార్, తిరుమల పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకానికి నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లి కల్చరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకం కింద స్కాలర్‌షిప్, ఆర్థిక సహాయానికి అర్హత కలిగిన మైనార్టీ విద్యార్థులు ఈనెల 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మొహమ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పేద మైనార్టీ విద్యార్థులు విదేశీ యూనివర్సిటీలలో చదువుటకు ఇంజనీరింగ్‌లో 60శాతం మార్కులు ఉండి పోస్టు గ్రాడ్యుయేట్, పీజీలో 60శాతం మార్కులు వచ్చి డాక్టరేట్ చదువుటకు 2025 జనవరి 1నుండి 2025 జూన్ 30వరకు విదేశి యూనివర్సిటీలలో అడ్మిషన్ తీసుకొన్న మైనార్టీస్, విద్యార్థులకు ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకం కింద స్కాలర్‌షిప్, ఆర్థిక సహాయం మంజూరుకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. కుటుంబ ఆదాయం 5లక్షల లోపు ఉండాలని, అమెరికా, యూకె, ఆస్ట్రేలియా, కెనడా, సింగాపూర్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, న్యూజిలాండ్, దక్షిణకొరియా దేశాలలోని యూనివర్సిటీలలో అడ్మిషన్ పొంది ఉండాలని పేర్కొన్నారు. వి జూన్ 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని సంబంధిత సర్టిఫికెట్స్ మూడు జతల జిరాక్స్ ప్రతులతో జూలై 31తేదీ లోగా జిల్లా మైనార్టీస్ సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. ఎంపికైన విద్యార్థులకు 20లక్షల ఉపకార వేతనం, ఆర్థిక సహాయం రెండు విడతలలో 60వేల రూపాయల వరకు విమాన చార్జీలు చెల్లిస్తారని, ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనార్టీస్ సంక్షేమ అధికారి ఆప్రకటనలో తెలిపారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

ఎలిగేడు, మే 31 (ఆంధ్రజ్యోతి): ధూళికట్ట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ధూళికట్ట ఆగ్రోస్‌లు సబ్సిడీపై జీలుగ విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి ఉమాపతి తెలిపారు. ఒక్కోబస్తా 30కిలోలకు సబ్సిడీ మినహా రైతు రూ.2137.50లను చెల్లించి తీసుకోవాలని తెలిపారు. ఒక్క బస్తా రెండు ఎకరాల భూమికి సరిపోతుందన్నారు. కావలసిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ ఇచ్చి తీసుకుపోవాలని తెలిపారు.

బీసి నాయకుడికి ప్రభుత్వ విప్ పరామర్శ

ధర్మారం, మే 31 (ఆంధ్రజ్యోతి) ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీసి సంక్షేమ సంఘం స్టేట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి, గొర్రెల కాపరుల సంఘం మండల అధ్యక్షుడు జంగ మహేందర్‌ను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. పాలకుర్తి రాజేశం, కాడె సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

నరకాన్ని తలపిస్తున్న ఆర్టీసీ బస్ ప్రయాణం

రామగిరి, మే 31(ఆంధ్రజ్యోతి): ఉచిత బస్ ప్రయాణం ప్రయాణికులకు నరకాన్ని చూపుతోంది. పరిమితంగా రూట్ బస్‌లను వేయడంతోపాటు వేసవి సెలవుల నేపథ్యంలో వివిధ ప్రాంతాలకు వెళ్ళాలనే కుటుంబాలకు ఇబ్బందులకు గురవుతున్నారు. కిక్కిరిసిన జనాలతో బస్‌లు నడుస్తున్నాయి. ఎండలో గంటల తరబడి బస్‌ల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులకు ఆర్‌టీసీ బస్‌లు కొన్ని స్టేజీలపై నిలుపకుండానే వెళ్లిపోతున్నాయి. ఉచిత బస్ సర్వీసులు అందుబాటులో లేక ప్రైవేట్ వాహనాల్లో వెళ్లే పరిస్థితి ఉంది. సామర్థ్యానికి మించి బస్‌లో ప్రయాణికులు ఉండడంతో స్టేజీలపై ఆపడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మంథని నుంచి కరీంనగర్‌కు మరిన్ని బస్ సర్వీసులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గురుకులంలో ఖాళీ సీట్లకు

దరఖాస్తుల ఆహ్వానం

ధర్మారం, మే 31 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని మిని గురుకులం ఇంగ్లీష్ మీడియంలో వివిధ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం గిరిజన బాలికల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ గురుకుల ప్రాంతీయ సమన్వయ అధికారి డి.ఎస్. వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరమునకు గాను 1వ, తరగతిలో 30 సీట్లు, 2వ, తరగతిలో 5సీట్లు, 3వ, తరగతిలో 6 సీట్లు, 4వ, తరగతిలో 5 సీట్లు 5వ, తరగతిలో 5 సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఆసక్తి కలిగిన గిరిజన విద్యార్థినీల తల్లిదండ్రులు ధర్మారంలోని గిరిజన మిని గురుకులంలో జూన్ 6 లోగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఇతర వివరాలకోసం 90304994490 సెల్ నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.



ఆర్జీ-2 సీఎంఓఏఐ ప్రెసిడెంట్‌గా రాముడు



యైటింక్లయిన్‌కాలనీ, మే 31(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియా కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ (సీఎంఓఏఐ) అధ్యక్షుడిగా ఎం రాముడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆర్జీ-2 ఎస్వోటూ జీఎంగా పని చేస్తున్న రాముడును ఏరియా అధ్యక్షుడిగా ఎన్నికైనట్టు అసోసియేషన్ ఒక ప్రకటనలో పేర్కొన్నది. సెక్రెటరీగా సంజీవ్, జాయింట్ ట్రెజరర్‌గా భాస్కర్‌రెడ్డిలను ఎన్నుకున్నట్టు సీఎంఓఏఐ ఆర్జీ-2 ప్రకటనలో పేర్కొన్నది.

ఆవిర్భావ దినోత్సవ వేడుకలపై సమావేశం

యైటింక్లయిన్‌కాలనీ, మే 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా సేవా సభ్యులు తమవంతు సహకారాన్ని అందించాలని ఆర్జీ-2 సేవా అధ్యక్షురాలు వనజా వెంకటయ్య కోరారు. శనివారం సేవా సభ్యులతో సీఈఆర్ క్లబ్‌లో ఆమె సమావేశమయ్యారు. జూన్ 2న సీఈఆర్ క్లబ్‌లో జరిగే ప్రధాన వేడుకల్లో స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్టు ఆమె తెలిపారు. వృత్తి విద్యాకోర్సు ల్లో శిక్షణ పొందిన వారు తమ ఉత్పత్తులను ఏర్పాటు చేసుకోవాలని ఆమె సూచించారు. కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, ఉద్యోగులు, వారి కుటుంబాలకు చెందిన మహిళలు పాల్గొనేలా చూడాలని సేవా అధ్యక్షురాలు సభ్యులకు సూచించారు. డీవైపీఎం శ్యాంప్రసాద్, లేడీస్ క్లబ్ సభ్యులు లీలావతి రాముడు, కవితా అనిల్ కుమార్, శారద మాధరరావు, పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి


సర్టిఫికెట్లను అందిస్తున్న ఏపీఏ జీఎం నాగేశ్వర్‌రావు

రామగిరి, మే 31(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు వృత్తి సంబంధిత శిక్షణా కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఏ జీఎం నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం విటిసి కార్యాలయంలో స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ సెంటర్‌లో సర్టిఫికెట్ ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రెం డు వారాల పాటు ఉచిత కంప్యూటర్(డిటిపి) శిక్షణ తరగతుల్లో శిక్షణ పొందిన యువతి, యువకులకు సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడు తూ సింగరేణి యాజమాన్యం స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని చేపట్టిందని, అందులో 38 ఉచిత శిక్షణ కోర్సులలో ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఉచిత శిక్షణ కోర్సులను సద్వినియోగం చేసుకొని యువత స్వయం ఉపాధి అవకాశాలను పొందాలని సూచించారు. అధికారులు రామ్మోహన్, సత్యనారాయణ, సుజీత్, శ్రీనివాస్, బెంజిమెన్, అభ్యర్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సబ్ జూనియర్ వుషు పోటీల్లో ఖని విద్యార్థికి పతకం



వెండి పతకంతో కోడం వైష్ణవి

కోల్‌సిటీటౌన్, మే31(ఆంధ్రజ్యోతి): ఇటీవల తమిళనాడులోని కెఎస్ఆర్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన 25వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ వుషు పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరుపున గోదావరిఖనికి చెందిన కోడం వైష్ణవి ప్రతిభ కనపర్చి వెండి పతకం సాధించింది. కాటాస్ ఫ్లెక్సీబుల్ వెపన్ అండర్ 12 విభాగంలో వైష్ణవి ప్రతిభ కనపరిచింది. గోదావరిఖనికి చెందిన వైష్ణవి జాతీయస్థాయిలో పతకాన్ని సాధించడంపై తెలంగాణ వుషు జనరల్ సెక్రటరీ ఉమర్, జాయింట్ సెక్రటరీ సతీష్, పెద్దపల్లి జిలా జనరల్ సెక్రటరీ కుమార్, కోచ్ విష్ణువర్ధన్ అభినందించారు.

దేహదానానికి అంగీకారం



అంగీకార పత్రాలు అందజేస్తున్న రాజలింగయ్య, గట్టయ్య

కళ్యాణ్‌నగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): సింగరేణి మెడికల్ కళాశాలకు మరణానంతరం దేహాలను దానం చేయడానికి ఇద్దరు సింగరేణి రిటైర్డ్ కార్మికులు ముందుకు వచ్చారు. శనివారం గోదావరిఖని శ్రామిక భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ కార్మికులు రాజలింగయ్య, నూకల గట్టయ్య మరణానంతరం దేహాలను మెడికల్ కళాశాలకు ఇచ్చేందుకు సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒప్పంద పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య విద్యార్థుల పరిశోధన కోసం తమ దేహాలను దానం చేస్తున్నామని, ప్రతి ఒక్కరూ మూడనమ్మకాలు వీడి నేత్ర, అవయవదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆదర్శవంతమైన నిర్ణయం తీసుకున్న రాజలింగయ్య, గట్టయ్యను సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, ఆరెల్లి రాజమొగిలి, మెండె శ్రీనివాస్ అభినందించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి లింగమూర్తి, ప్రచార కార్యదర్శి వాసు, అనుదీప్, శశికళ, వేణుగోపాల్‌రెడ్డి, కోట నరహరి, మహేష్ పాల్గొన్నారు.

చేపల పెంపకం పై దృష్టి సారించండి


కరపత్రాలను ప్రదర్శిస్తున్న అధికారులు సిబ్బంది

ఓదెల, మే 31 (ఆంధ్రజ్యోతి): రైతన్నలు వ్యవసాయంతోపాటు చేపలు, కోళ్ల పెంపకం, కూరగాయల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీనివాస్ అన్నారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా శనివారం ఇందుర్తి, పొత్కపల్లి, నాంసానిపల్లి గ్రామపంచాయతీల వద్ద ముందస్తు సాగు విధానంపై రైతులకు అవగాహన సదస్సులను నిర్వహించారు. శాస్త్రవేత్తలు శ్రీనివాస్ భాస్కర్‌రావు, వినోద్‌కుమార్ మాట్లాడుతూ, ఆర్థిక స్వావలంబన కోసం స్వశక్తి మహిళల సంఘాలకు డ్రోన్ ఆపరేటింగ్‌లో శిక్షణ కేంద్రాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ సాగు పద్ధతులు, నూతన విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో భాస్కర్, ఏఈఓ సంధ్య, కిరణ్, మౌనిక పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ


పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో

పాలకుర్తి, మే 31(ఆంధ్రజ్యోతి): పాలకుర్తి మండల విద్యా వనరుల కేంద్రంలో పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు మండలంలోని 31 ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకములు సరఫరా చేస్తున్నామని ఎంఈవో టీ విమల తెలిపారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జే కమలాకర్‌రావు, గాయత్రీ దేవి, మండల రిసోర్స్ పర్సన్స్ సతీష్, జ్యోతి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో ఆయా ప్రభుత్వ పాఠశాలలకు ఎంఈఓ మహేష్ 2025-26విద్యా సంవత్సరం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. అన్ని పాఠశాలలకు పిల్లలకు సరిపడా పాఠ్యపుస్తకాలతో పాటు నోటుబుక్స్ కూడా అందజేసినట్లు ఎంఈఓ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారని మీపిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

3 నుంచి రెవెన్యూ సదస్సులు

కాల్వశ్రీరాంపూర్, మే 31 ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో 3వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిరర్వహించనున్నట్లు తహసీల్దార్ జగదీశ్వర్‌రావు తెలిపారు. ఈనెల 3న కాల్వశ్రీరాంపూర్, గంగారం, 4న ఇప్పలపల్లి, ఆశన్నపల్లి, 5న పెద్దరాతుపల్లి, పెగడపల్లి, 6న చిన్నరాతుపల్లి, పెగడపల్లి, 9న మొట్లపల్లి, మడిపల్లి, 10న కిష్టంపేట, మడిపల్లికాలనీ, అంకంపల్లి, 11న మీర్జంపేట, మంగపేట, 12న తారుపల్లి, కునారం, 13న మల్యాల, వెన్నంపల్లి, ఈనెల 16న పందిళ్ళ, ఆరెపల్లి, వెన్నంపల్లి, 17న ఎదులాపూర్, జాఫర్‌ఖాన్‌పేట, ఈనెల 18న పెద్దంపేట, లక్ష్మీపూర్ నిర్వహించే రైతు సదస్సులో ఏమైనా రైతుల భూసమస్యలు ఉంటే సమస్యల పరిష్కారానికి తమ భూపత్రాలతో రైతులు పాల్గొనాలని తహసీల్దార్ పేర్కొన్నారు.

రేపు రాష్ట్ర అవతరణ దినోత్సవం

ఎలిగేడు, మే 31 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భాస్కర్‌రావు తెలిపారు. సోమవారం ఉదయం 9.15గంటలకు కార్యాలయంలో జాతీయ పతాక ఆవిష్కరణ ఉంటుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.